క్లుప్తంగా

డిజిటల్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతి

పెద్దపంజాణీ: బట్టందొడ్డి గ్రామ సచివాలయం డిజిటల్ అసిస్టెంటు జి. జయకృష్ణ ఉద్యోగోన్నతి పొంది మండలంలోని మాదనపల్లె పంచాయతీ కార్యదర్శి గ్రేడ్–5 గా, అలాగే పుంగనూరు మండలం కపాడమిట్టపల్లె సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ జి. వినోద్ కుమార్ రెడ్డి కూడా మండలంలోని చలమంగళం గ్రామ సచివాలయం పంచాయతీ కార్యదర్శి గ్రేడ్–5 గా నియమితులయ్యారని ఎంపీడీఓ బాలాజి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బాల్య వివాహాలను నిరోధించడమే ధ్యేయం


అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ అరుణకుమారి

వి.కోట: బాల్య వివాహాలను నిరోధించడమే ధ్యేయంగా కిశోరి వికాస్ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ అరుణకుమారి పేర్కొన్నారు. కిశోర బాలికల వికాసంపై శుక్రవారం స్థానిక శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించి సీడీపీఓ మాట్లాడారు. కిశోర బాలికలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, కిశోర బాలికల్లో కలిగే శారీరక–మానసిక మార్పులు, రుతుచక్రం సమస్యలు, జీవన నైపుణ్యాలు.. ఇత్యాది అంశాలపై గ్రామాల్లో కార్యకర్తలు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పీఎన్ లక్ష్మి మాట్లాడారు.

బహిర్భూమికి వెళ్లొస్తానని..!

- వివాహిత అదృశ్యం

పెద్దపంజాణీ: మండలంలోని బసవరాజు కండ్రిగకు చెందిన వివాహిత అదృశ్యమైంది. శుక్రవారం ఏఎస్ఐ చంద్రబాబు తెలిపిన వివరాలు..బసవరాజుకండ్రిగకు చెందిన వెంకట్రమణ భార్య ప్రమీల(21) గురువారం ఉదయం సుమారు 11 గంటల ప్రాంతంలో బహిర్భూమికి వెళుతున్నట్లు తన అత్త లక్ష్మమ్మకు చెప్పి సమీపంలోని పొలానికి వెళ్లింది. మధ్యాహ్నమైనా ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితులు, సమీప గ్రామాలలో గాలించినా ఆమె ఆచూకీ లభించలేదు. లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి వివిధ కోణాల్లో ఏఎస్ఐ దర్యాప్తు చేస్తున్నారు.

టి.వడ్డూరులో గంగచాటు


ఆలయం వద్ద చేస్తున్న పూజలు

పలమనేరు: మండలంలోని టి.వడ్డూరులో శుక్రవారం గంగచాటు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ మహిళలు పసుపు నీటి కుండలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారిని అభిషేకించారు. ప్రత్యేక పూజలు చేశారు. వీధుల్లో బలిహరణం చేస్తూ జాతర చాటింపు వేశారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 30 మంది ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

పలమనేరు: పట్టణంలోని ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో బెంగళూరుకు చెందిన ఆల్ డిజిటెక్ కంపెనీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన క్యాంపస్ ఎంపికల్లో కళాశాలకు చెందిన 30మంది ఉద్యోగాలకు కాలేజీ నిర్వాహకులు ఎంవీఆర్ రెడ్డి తెలిపారు. వీరికి 2 లక్షల నుంచి 3లక్షల వార్షిక వేతనంలో ప్యాకేజీలున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీసుధ, అధ్యాపకులు పాల్గొన్నారు.

గంగమ్మకు విశ్వ బ్రాహ్మణుల పూజలు


అన్నదానం చేస్తున్న విశ్వ బ్రాహ్మణ సంఘం

పలమనేరు: పట్టణంలో నిర్వహిస్తున్న తిరుపతి గంగమ్మ జాతరలో భాగంగా గంగచాటు రెండోరోజైన శుక్రవారం స్థానిక గంగమ్మ ఆలయం వద్ద అమ్మవారికి పట్టణంలోని విశ్వ బ్రాహ్మణులు పూజలు చేసిన అనంతరం అన్నదానం చేశారు. అలాగే పట్టణానికి చెందిన జీలుబాయ్ భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దాచూరికి ఘన నివాళి

ఐరాల: యూటీఎఫ్ ఉద్యమ పితామహుడు, ఉపాధ్యాయ ఉద్యమ మార్గదర్శకుడు దాచూరి రామిరెడ్డి అని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు స్మరించారు. దాచూరి 9వ వర్ధంతి పురస్కరించుకుని మండల యూటీఎఫ్ శాఖ స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించింది. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఏర్పాటులో ఆయన కీలక పాత్ర పోషించారని ప్రస్తుతించింది.

ప్రత్యామ్నాయం.. ఆదాయ మార్గం

మట్టినే నమ్ముకున్న రైతన్నలకు వ్యవసాయం గిట్టుబాటు కాక ఒక్కోసారి వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించక నష్టాల పాలవుతున్నారు. పెట్టుబడి కూడా అందక అప్పులే దిగుబడి అవుతున్న సందర్భాలు చవిచూస్తున్నారు. ఇప్పుడు రైతన్నల్లో చైతన్యం వచ్చింది. ఒక పంటలో నష్టం వస్తే రెండో పంట కాలానికి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారిస్తూ కొత్త పంథాలో సాగుతున్నారు. ఈ కోవలో ఇప్పుడు కొత్తిమీర సాగు చేసి నికర ఆదాయం గడిస్తున్నారు.

- తక్కువ పెట్టుబడితో లాభాల కొత్తిమీర సాగు
- పంట కాలం కేవలం 60 రోజులే
- ఏడాది పొడవునా సాగుకు అనుకూలం
- పంట సాగుకు తక్కువ ఖర్చుతో నికర ఆదాయం


పలమనేరు ప్రాంతంలో సాగవుతున్న కొత్తిమీర

పలమనేరు: చిత్తూరు జిల్లాలోని పడమటి ప్రాంతాల్లో ఈ ఏడాది వివిధ రకాల కూరగాయ పంటలు సాగు చేసిన రైతులు ధరలు లేక నష్టాలబాట పట్టారు. ఇక్కడి సాగు చేసే టమాట, బీన్స్, మిరప, వంగ, బంగాళాదుంప, మస్క్ మిలాన్, బీర, కాకర తదితర కూరగాయలకు గిట్టుబాటు ధరలు లేవు. దీంతో పెట్టుబడులు కూడా దక్కలేదు. దీంతో పలమనేరు ప్రాంతంలోని రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారిస్తున్నారు. ముఖ్యంగా చిన్న,సన్నకారు రైతులు తక్కువ పెట్టుబడి, నీరు, పంటకాలం ఉన్న కొత్తిమీర సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

పేదవాని పంటగా పేరు

ఇక్కడ పండే సుగంధ ద్రవ్యాల పంటల్లో ముఖ్యమైన పంట కొత్తిమీర. సన్న, చిన్న కారు రైతులకు నీటి వసతి తక్కువగా ఉన్న రైతులకు ఈ పంట ఎంతో లాభదాయకం. అందుకే దీన్ని పేదవాని పంటగా పిలుస్తారు. ప్రస్తుతం వర్షాలు లేక భూగర్భ జలాలు అడుగంటిన తరుణంలో వస్తున్న కొద్దిపాటి నీటితో తక్కువ వ్యవధిలో కొత్తిమీర సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. పొరుగునే ఉన్న కర్ణాటకలో చాలామంది రైతులు దీర్ఘకాలిక పంటలకు స్వస్తి పలికి కొత్తిమీర సాగు చేస్తున్నారు. వీరిని చూసి రాష్ట్రంలోని కర్ణాటక సరిహద్దు మండలాల్లోని రైతులు ప్రస్తుతం కొత్తిమీర సాగుపై దృష్టి సారించారు. ప్రస్తుతం పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో వంద హెక్టార్లలో ఈ పంట సాగవుతోంది.


మొక్కలో కాసిన ధనియాలు

ఏడాది పొడవునా సాగుకు అనుకూలం

ఈ పంటను ఏడాది పొడవునా సాగు చేసుకోవచ్చు. పంట కాలం కేవలం 50 నుంచి 60 రోజులు మాత్రమే. ఎకరానికి 6 కిలోల ధనియాలను చల్లాలి. పంట బాగా వస్తే ఎకరానికి ఆరు క్వింటాళ్ల వరకు దిగుబడి ఉంటుంది. ముందుగానే కొత్తమీరను అమ్ముకోవచ్చు. ఎకరానికి రెండున్నర టన్నుల కొత్తమీర దిగుబడి ఉంటుంది. ప్రస్తుతం కొత్తిమీర కట్ట రూ.10 గానూ, ధనియాలు కిలో రూ.120గా ఉంది. ఈ మేరకు ధరలుంటే ఎకరానికి రూ.24 వేల వరకు రాబడి వస్తుంది. కొత్తిమీరను తోటల వద్దే వ్యాపారులు కొంటున్నారు. ధర లేనప్పుడు ధనియాలను ఇంట్లో నిల్వ ఉంచుకుని ధరలున్నప్పుడు విక్రయించుకోవచ్చు. అందుకే దీన్ని రైతులకు నష్టం లేని పంట అంటారు.



నోటీస్ బోర్డు

9 నుంచి కావమ్మ, మారయ్య తిరునాళ్ల

సదుం: మండలంలోని భట్టువారిపల్లె కావమ్మ, మారయ్య ఆలయంలో ఈనెల 9 నుంచి తిరునాళ్ల నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 9న రాత్రి అభిషేకం, ఆరాధన, జంగాల కథ, 10న కల్యాణోత్సవం, జంగాలకథ, సారె పంపిణీ, 11న జంగాలకథ, అగ్నిగుండ ప్రవేశం ఉంటుందన్నారు. మూడు రోజుల పాటు రాత్రి వేళ భక్తులకు అన్నదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో రత్న, నాగభూషణం, కరెంటు బాబు, భాస్కర్, కుమార్, దేవేంద్ర, రూపేష్, కనక తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ హబ్‌లో ఉచిత శిక్షణ

పలమనేరు: టెన్త్ నుంచి డిగ్రీ అర్హతతో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో డొమెస్టిక్ డాటా ఎంట్రీ ఆపరేటర్, ఆఫీస్ అసిస్టెంట్ కోర్సుల్లో నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 7వ తేదీలోపు స్థానిక స్కిల్‌హబ్‌లో దరఖాస్తు చేసుకోవాలని, శిక్షణానంతరం సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామని తెలియజేశారు.

బ్రాహ్మణ పిల్లలకు ఉపనయనం

పుంగనూరు: ఆదిశంకరాచార్యుల జయంతి పురస్కరించుకుని బ్రాహ్మణులు శుక్రవారం తమ పిల్లలకు ఉపనయన కార్యక్రమాలు నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు సురేంద్రరావు ఆధ్వర్యంలో తొలుత శంకరాచార్యుల విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఉపనయన కార్యక్రమాలు నిర్వహించి, గాయత్రి మంత్రం పఠించే విధానాన్ని నూతన వటువులకు వివరించారు. అన్నదానం చేశారు.

ద్రౌపది ధర్మరాజుల మహోత్సవాలు ప్రారంభం


శ్రీ ధర్మరాజు విగ్రహం వద్ద కడవపై నిలబెట్టిన కత్తి


ద్రౌపదీ ధర్మరాజుల ఆలయం

గుడుపల్లె: మండలంలో యామగానిపల్లెలోని శ్రీ ద్రౌపది ధర్మరాజులు మహాభారత మహోత్సవాలు శుక్రవారం అంకురార్పణ, ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. కుప్పం నియోజకవర్గంలోని 86 గ్రామాలకు సంబంధించిన వన్నె కుల క్షత్రియులు 18 రోజుల పాటు ఈ ఉత్సవాలను నిర్వహించనున్నారు. పగలు హరికథాగానం, రాత్రి నాటక ప్రదర్శనలు ఉంటాయని నిర్వాహకులు చెప్పారు. 3న ఉదంకుని చరిత్ర, భూతరాజు కథ ఉంటుందని, తర్వాత రోజుల్లో నిర్వహించే కార్యక్రమాలను తెలియజేశారు. 17న దుర్యోధనుని వధ, 20న పట్టాభిషేకం కార్యక్రమాలతో మహాభారత ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు.

మహాభారత మహోత్సవాలకు శ్రీకారం

ద్రౌపది ధర్మరాజుల మహాభారత మహోత్సవాల అంకురార్పణకు సంబంధించి ధర్మరాజు మూల విగ్రహం వద్ద మట్టి కుండ నిండుగా నీటి ఉంచి కింద ఇసుక వేసి చుట్టూ నవధాన్యాలను వేశారు. ధర్మరాజు విగ్రహానికికు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కడవపై కత్తిని ఏటవాలుగా నిలబెట్టారు. కత్తి సక్రమంగా నిటారుగా ఉంటే ఉంటే ఆ సంవత్సరం భారత మహోత్సవాలు బాగా జరుగుతాయని భక్తుల నమ్మకం. పట్టాభిషేకం రోజున తిరిగి ఆ కత్తిని తొలగిస్తారు.

11న తిరుపతిలో మాలల సభ


మాలల ఆత్మీయసభ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మాల మహానాడు నాయకులు

పుంగనూరు: ఈనెల 11న తిరుపతిలో మాలల ఆత్మీయ సభ నిర్వహిస్తున్నట్లు మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎన్ఆర్ అశోక్ తెలిపారు. శుక్రవారం అయన మాలల ఆత్మీయ సభ కరపత్రాలు ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. తిరుపతిలోని మంగళం రోడ్డు మార్గంలోని ఆశా కన్వెన్షన్ హాల్‌లో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్న ఈ సమావేశానికి నియోజకవర్గంలోని మాలల కుటుంబ సభ్యులు, మేధావులు, విద్యార్థులు హాజరై ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాయలసీమ మాలసభ కన్వీనర్ మల్లారపు మధు, నాయకులు వెంకటస్వామి, రవికుమార్, టి.శ్రీనివాసులు, కృష్ణమూర్తి, కురపర్తి శ్రీనివాసులు, బ్యాంక్ రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

అపూర్వసమ్మేళనం


బైరెడ్డిపల్లె ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

బైరెడ్డిపల్లె: స్థానిక జెడ్పీ హైస్కూల్లో 1983–1984లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు శుక్రవారం బైరెడ్డిపల్లెలోని ఓ కళ్యాణ మండపంలో సమ్మేళనం నిర్వహించారు. తమ స్కూల్ రోజులను గుర్తు చేసుకుని జ్ఞాపకాల పేజీలు తిరగేశారు. పరస్పరం యోగక్షేమాలు, కుటుంబ సభ్యుల గురించి తెలుసుకున్నారు. తమ అభ్యున్నతికి బాటలు వేసిన గురువులు జయచంద్ర, రామచంద్రయ్యను సత్కరించి ఆశీస్సులు పొందారు. పేద విద్యార్థుల చదువులకు తమవంతు సాయం చేస్తామని ప్రకటించారు.

సచివాలయ ఉద్యోగిపై కత్తితో దాడి

తంబళ్లపల్లె: స్నేహితుల మధ్య కలహాలతో ఓ గ్రామ సచివాలయ ఉద్యోగిపై కత్తితో దాడిచేసి గాయపరచిన సంఘటన గురువారం సాయంత్రం మండల కేంద్రంలో జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు వివరాలు..ఎర్రసానిపల్లె పంచాయతీ ఎర్రమద్దువారిపల్లెకు చెందిన కృష్ణమూర్తి కుమారుడు గణేష్(28) చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలం పుదిపట్ల సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఇతడికి కురబలకోట మండలం మట్లివారిపల్లెకు చెందిన ప్రవీణ్‌కుమార్ స్నేహితుడు. కొన్నిరోజుల క్రితం ప్రవీణ్ కుమార్‌ను తంబళ్లపల్లె మండలం చేలూరువాండ్లపల్లెకు చెందిన మున్వర్ స్థానిక బస్టాండ్‌లో బహిరంగంగా దూషించాడు. ఈ విషయమై గణేష్, మున్వర్‌ను అతడు నా స్నేహితుడు.. ఎందుకు దూషించావని ప్రశ్నించాడు. దీనిపై ఆగ్రహించి అతడికి నీవు సపోర్ట్ ఏంట్రా... నీ అంతు చూస్తానని బెదిరించాడు. ఈ క్రమంలో గణేష్, గురువారం సాయంత్రం స్నేహితులతో కలిసి హరిత సర్కిల్‌లోని చికెన్ పకోడా సెంటర్ వద్ద ఉండగా మున్వర్, అతడి అన్న మహమ్మద్, శశి ద్విచక్ర వాహనంలో వచ్చి గణేష్‌పై కత్తితో విచక్షణారహితంగా దాడి చేశారు. తలకు, ఎడమచేతి వేళ్లకు, కాళ్లకు రక్త గాయాలు కావడంతో చుట్టుపక్కల జనం కేకలు వేయడంతో ముగ్గురూ ద్విచక్రవాహనంలో పారిపోయారు. గాయపడిన గణేష్‌ను, స్నేహితులు సీహెచ్‌సీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమచికిత్స చేసి మదనపల్లె జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఫిర్యాదు మేరకు దాడి చేసిన ముగ్గురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు.

మొదలైన బ్రహ్మోత్సవాలు



చౌడేపల్లె: స్థానిక బజారు వీధిలోని శ్రీ అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం గణపతి ప్రార్థన, అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలుత ఆలయ అర్చకులు రాజశేఖర దీక్షితులు గజపీఠం, త్రిశూలాలకు పూజలు చేసిన అనంతరం వాటిని పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ అభిముఖంలోని మఠంలో పుట్టమన్నును తీసుకొచ్చి యాగశాలలో మొలకపోశారు. కలశ ప్రతిష్ఠ, ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు శివపార్వతుల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా ముస్తాబు చేసి పూజలు చేశారు.

తాగునీటి సమస్యల పరిష్కారానికి బోర్లు


బోరు మోటారు ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

–జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యలు తలెత్తిన గ్రామాల్లో కొత్తగా బోర్లు వేస్తామని జెడ్పీ చైర్మెన్ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని గంధారమాకులపల్లె వాసుల వినతి మేరకు జెడ్పీ నిధులతో రెండు బోర్ల పనులకు చైర్మన్ శుక్రవారం భూమిపూజ చేసి ప్రారంభించారు. పుష్కలంగా నీళ్లు రావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం గంగాదేవికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కమల్ నాథ్, వైఎస్సార్ సీపీ నేత నరేంద్ర, వార్డు మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో విగ్రహ ప్రతిష్ఠాపన


పూజ కార్యక్రమాల్లో జెడ్పీ చైర్మన్

వి.కోట: మండలంలోని గాండ్లపల్లెలో గ్రామస్తులు నిర్మించిన గంగమ్మ దేవి ఆలయంలో శుక్రవారం ప్రత్యేకపూజలు, వివిధ హోమాలు, కుంభాభిషేకం అనంతరం గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనఘనంగా నిర్వహించారు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు గ్రామస్తులు, ఆలయ నిర్వాహకులు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ పీఎన్ లక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

టి.వడ్డూరులో కిశోరి వికాసం


పలమనేరు: కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

పలమనేరు: మండలంలోని టి.వడ్డూరులో శుక్రవారం కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు.. సర్పంచ్ మునస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అక్కడి పాఠశాల విద్యార్థినులకు బాలికల సాధికారిత, విద్య ఆవశ్యకత, వ్యక్తిగత పరిశుభ్రత, బాల్యవివాహాలతో కలిగే అనర్థాలు–నష్టాల గురించి అవగాహన కల్పించారు. మండలంలో జూన్ 10వ తేదీ వరకు కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది, పిల్లల తల్లిదండ్రులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.


బైరెడ్డిపల్లెలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీడీపీఓ

బైరెడ్డిపల్లె మండలంలో..

బైరెడ్డిపల్లె: యువత మంచి ఆలోచనలతో ముందుకు సాగినప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించగలని సీడీపీఓ అరుణశ్రీ అన్నారు. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. పోస్టర్ల ఆవిష్కరించి సీడీపీఓ మాట్లాడారు. 11 నుంచి 19 ఏళ్లలోపు ఉన్న యువతీ యువకులు మంచి ఆలోచనలతో ముందుకు సాగాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, వైద్యాధికారులు, ఆరోగ్యసిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పలమనేరులో గంజాయి రౌడీల జోరు!

- సినీ ఫక్కీలో మారణాయుధాలతో దాడులు
- జాతర వేళ కలకలం
- సామాజిక మాధ్యమాల్లో వైరల్
- నిద్రావస్థలో పోలీసింగ్

పలమనేరు: ప్రశాంతతకు మారుపేరైన పలమనేరులో కొన్నాళ్లుగా చోటుచేసుకుంటున్న సంఘటనలు పట్టణ ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. రెండ్రోజుల క్రితం అమ్మవారి చాటు సందర్భంగా ఓ గ్యాంగ్ మరో గ్యాంగ్‌కు చెందిన వ్యక్తిపై కత్తులు, రాడ్లతో స్థానిక మంజునాథ థియేటర్ వద్ద విచక్షణారహితంగా దాడులు చేశారు. దీంతో అతనికి 40 కత్తిపోట్లు పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇది కేవలం పాత కక్షలతోనేనని స్థానిక పోలీసులు కొందరిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. గంజాయి మత్తుకు అలవాటు పడిన మైనర్లు సైతం ముఠా తగాదాల్లో మారణాయుధాలను వాడటం అందరినీ కలవరపెడుతోంది. పలమనేరులో మళ్లీ రౌడీయిజం జడలు విప్పుతోందనే మాట వినిపిస్తోంది.

గతంలో పోలీసులపైనే దౌర్జన్యం!

ఓ కేసుకు సంబంధించి విచారణకు వెళ్లిన పోలీసులపై పట్టణంలోని ఓ ప్రాంతానికి చెందిన వారు మూకుమ్మడిగా సీఐలపైనే దౌర్జన్యానికి దిగారు. అప్పట్లో దీనిని పోలీసులు తేలిగ్గా తీసుకోవడంతోనే తాజాగా హత్యాప్రయత్నానికి బీజం పడిందనే మాట వినిపిస్తోంది. అప్పట్లో పోలీసులు రౌడీమూకలపై కఠిన చర్యలు తీసుకోలేదు. వీరిపై కేసులు సైతం తూతూమంత్రంగా పెట్టి వదిలేశారు. ఇదంతా పోలీసుల స్వయంకృతాపరాధంగా మారింది.



రెండ్రోజుల క్రితం గంగచాటులో ఓ యువకునిపై కత్తులతో దాడి చేస్తున్న మైనర్లు (ఫైల్), ఆస్పత్రిలో బాధిత యువకుడు

గంజాయి మత్తులో తూలుతున్న మైనర్లు

పట్టణంలో కొన్నిరోజులుగా గంజాయి అమ్మకాలు జోరందుకున్నాయి. దీనిపై పెద్దగా పోలీసులు సైతం దృష్టి పెట్టలేదు. స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి సైతం మున్సిపల్ సమావేశంలో ఇదే అంశంపై పోలీసులను ఓ రేంజ్‌లో హెచ్చరించినా ఫలితం శూన్యం. మరోవైపు గంజాయికి అలవాటు పడినవారిలో యువతతోపాటు మైనర్లు ఎక్కువగానే ఉన్నారు. ఆ మత్తులో వీరు ఏం చేస్తున్నారో వారికే తెలియడం లేదు. తాజాగా జరిగిన హత్యాయత్నంలో చిన్నపిల్లలు సైతం కత్తులు, రాడ్లతో దాడులు చేసిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. దీన్ని చూసిన జనం అసలు పట్టణంలో పోలీసింగ్ ఉందా, లేదా? అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఎస్పీ అయినా స్పందించి, పలమనేరులో రౌడీమూకలను, గంజాయి బ్యాచ్‌లను ఏరివేసి, శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.